క్లుప్తంగా

పీజీఆర్ఎస్ రద్దు

నెహ్రూ నగర్: ఉమ్మడి కృష్ణా – గుంటూరు పట్ట భద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికకు సంబంధించి జనవరి 29 వ తేదీ నుంచే ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున నగర పాలక సంస్థలో ప్రతి సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్, డయల్ యువర్ కమిషనర్) కార్యక్రమాలను రద్దు చేసినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడ్ ముగిసిన అనంతరం యథావిధిగా నిర్వహించ నున్నట్లు చెప్పారు. స్థానిక సమస్యల ఫిర్యాదులను జీఎంసీ కాల్ సెంటర్ 0863–2345103, 104 కి కాల్ చేయవచ్చని తెలిపారు.

పేదల ఇళ్ల స్థలాలకు దరఖాస్తులు

లక్ష్మీపురం: పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు కోరుతూ దరఖాస్తు చేయించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యాదర్శి జె.అజయ్‌కుమార్ తెలిపారు. పాత గుంటూరు పార్కు సెంటర్‌లో ఆదివారం సీపీఐ 8 వ డివిజన్ ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాలు పట్టణ, నగరంలో ఉన్న అర్హులైన పేదలకు 2 సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి, 5 లక్షల రూపాయలు ఇంటి నిర్మాణానికి ఇవ్వాలని కోరుతూ అర్జీలు పూర్తి చేసే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య, నూతలపాటి చిన్న, 8వ డివిజన్ కార్యదర్శి కట్టా శ్రీనివాస్ రావు, స్థానిక నాయకులు కాయల రామారావు, నాగరాజు, రాజేష్, సతీష్, కిరణ్ పాల్గొన్నారు.

ముద్రగడ ఇంటిపై దాడి అన్యాయం

లక్ష్మీపురం: ముద్రగడ పద్మనాభ రెడ్డి ఇంటిపై జరిగిన దాడిని కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వర రావు(సంగమ్) ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రతి చర్య వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కట్టడి చేయడానికి మాత్రమే ఉద్దేశించిందని పేర్కొన్నారు. ఈనెల 5న ఫీజు పోరు వైఎస్ జగన్ ప్రకటించిన నేపథ్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులను భయానికి గురి చేద్దామనే ప్రయత్నమే ముద్రగడ ఇంటిపై దాడి అని అభిప్రాయపడ్డారు.

యోగా శాస్త్రబద్ధమైన జీవన విధానం



లక్ష్మీపురం: యోగా శాస్త్ర బద్ధమైన జీవన విధానమని, ఆధునిక జీవన శైలిలో ఒత్తిడిని తట్టుకుని ఆహ్లాదకరమైన జీవితాన్ని గడిపేందుకు నిత్య జీవితంలో యోగాను సాధనంగా మార్చుకోవాలని సీనియర్ ప్రభుత్వ యోగా కోచ్ రామినేని రవి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యోగా కేవలం వ్యాయమం ఆరోగ్యనికి సంబంధించింది మాత్రమే కాదని, అది శక్తి వంతమైన జీవన మార్గమన్నారు. మనసును లగ్నం చేసి క్రమం తప్పకుండా సాధన చేస్తే మనిషిని శారీరకంగా మానసికంగా యోగా ఉన్నత స్థితికి చేరుస్తుందన్నారు.

యువతి అదృశ్యం

లక్ష్మీపురం: యువతి అదృశ్యంపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. వికాస్‌నగర్ ప్రాంతానికి చెందిన ఓ యువతి అమరావతి రోడ్డులోని పాలిటెక్నిక్ కళాశాలలో ప్రథమ ఏడాది చదువుతోంది. శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీఏసీఎస్‌ల్లో రైతులకు రబీ రుణాలివ్వాలి

ప్రత్తిపాడు: పెదనందిపాడులోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లోని రైతులకు రబీ సీజన్‌లో పంట రుణాలు వెంటనే ఇవ్వాలని సుభిక్ష సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు కొల్లా సీతారామయ్య ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పెదనందిపాడు ప్రాంతంలో రబీ సీజన్‌లో వేల మంది రైతులు వాణిజ్య పంటలైన మిర్చి, పొగాకును సాగు చేశారని, వేలల్లో పెట్టుబడులు అవుతున్నాయని చెప్పారు. రుణాల కోసం రైతులు సొసైటీలకు వెళ్తే, రుణాల మంజూరు అధికారం స్పెషల్ ఆఫీసర్‌కు మాత్రమే ఉందని చెబుతున్నారని, ప్రత్యేకాధికారి గడిచిన ఏడు నెలలుగా అందుబాటులో లేరని పేర్కొన్నారు. దీని వలన రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఖరీఫ్‌లో కూడా రైతాంగం రుణాలు పొందలేకపోయారని తెలిపారు. సమస్యపై ఇప్పటికే సహకార సంఘాల రిజిస్ట్రార్‌కు కూడా వినతిపత్రం అందించామని, సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుని రుణాలు మంజూరు చేయాలని కొల్లా కోరారు.

భక్తిశ్రద్ధలతో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

గుంటూరు రూరల్: గోరంట్లలో అన్నపూర్ణనగర్‌లోని శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు మూడో రోజు కనుల పండువగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కొనసాగాయి. కార్యక్రమాల్లో భాగంగా ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ధ్వజారోహణ, తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు యర్రంశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి సుప్రభాతసేవ, ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, స్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహించటం జరిగిందన్నారు.

మీ కిడ్నీలు సురక్షితమేనా?

- పెరుగుతున్న కిడ్నీ బాధితులు
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన

గుంటూరు మెడికల్: ఆధునిక జీవనశైలికి అలవాటు పడటంతో కిడ్నీ బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతోంది. ఇంట్లో తినడం మానేసి, వండటం మానేసి హోటల్స్‌లో, ఆన్‌లైన్ ద్వారా ఆహార పదార్థాలు తెచ్చుకుని తినడం ద్వారా కిడ్నీ సమస్యలు పెరిగి పోతున్నాయని సర్వేలు చెబుతున్నాయి. వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

అధిక సంఖ్యలో బాధితులు...

జీజీహెచ్‌లో నెఫ్రాలజీ విభాగంలో ముగ్గురు వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. వారంలో బుధవారం, శనివారం ఓపీ విభాగాలో, మిగిలిన రోజుల్లో క్యాజువాలిటిలో కిడ్నీ సమస్యల బాధితులకు చికిత్స అందిస్తున్నారు. ప్రతిరోజూ ఓపీలో 60 నుంచి 70 మంది కిడ్ని బాధితులు చికిత్స పొందుతున్నారు. ప్రతిరోజూ 50 మంది డయాలసిస్ చేయించుకుంటున్నారు. జిల్లాలో 25 మంది కిడ్నీ వైద్య నిపుణులు ఉన్నారు. ఈ వైద్యుల వద్దకు ప్రతిరోజూ సుమారు 40 నుంచి 60 మంది కిడ్నీ బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. వ్యాధిపై అవగాహన కలిగి ఉండి కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రాథమిక దశలోనే కట్టడి చేయవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.



జీజీహెచ్‌లో డయాలసిస్ వైద్యసేవలు పొందుతున్న కిడ్నీ రోగి(ఫైల్)

జీజీహెచ్‌లో చికిత్స పొందినవారు....

గుంటూరు జీజీహెచ్‌లో 2022లో ఓపీ వైద్య విభాగంలో 1,269 మంది, ఇన్‌పేషెంట్ విభాగంలో 178 మంది కిడ్నీ రోగులు చికిత్స పొందారు. 2023లో ఓపీ వైద్య విభాగంలో 1,507 మంది, ఇన్‌పేషెంట్ విభాగంలో 207 మంది, 2024లో ఓపీ వైద్య విభాగంలో 2,552 మంది, ఇన్‌పేషెంట్ విభాగంలో 297 మంది కిడ్నీ రోగులు చికిత్స పొందారు.

వ్యాధి లక్షణాలు...

కిడ్నీ వ్యాధి సోకినవారిలో ముఖం, కాళ్లవాపులు కనిపిస్తాయి. ఆయాసం, అలసటగా ఉంటుంది. పనిమీద ఏకాగ్రత తగ్గటం, ఆకలి మందగించటం జరుగుతుంది. మూత్రం రాత్రివేళల్లో ఎక్కువసార్లు రావటం, కొన్ని సందర్భాల్లో మూత్రం సరిగా రాకపోవటం, మూత్రంతోపాటు రక్తం కారుతుంది. మూత్రం పోసేటప్పుడు చురకు, మంట లాంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే కిడ్నీ వైద్యుడిని సంప్రదించాలి.

హైరిస్క్‌వారు జాగ్రత్తగా ఉండాలి



బీపీ, షుగర్ ఉన్న వాళ్లు హైరిస్క్ గ్రూప్‌కు చెందిన వారు. వీరి కిడ్నీ జబ్బుల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంది. కీళ్ల నొప్పుల మందులు ఎక్కువ కాలం వాడుతున్నవారు, తరచూగా ఇన్‌ఫెక్షన్‌ల బారిన పడుతున్నవారికి వ్యాధి ప్రమాదం ఉంది. జీవనశైలిలో వచ్చిన మార్పుల వల్ల 20 ఏళ్ళు దాటిన ప్రతి 10 మందిలో ఒకరు కిడ్నీ జబ్బు బారిన పడుతున్నారు.కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి. సకాలంలో గుర్తించకపోతే కిడ్నీలు పాడయ్యే ప్రమాదం ఉంది.

వ్యాధి బారిన పడకుండా...



క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. రక్తంలో చక్కెర శాతాన్ని, అధిక రక్తపోటులను నియంత్రణలో ఉంచుకోవాలి. ఆరోగ్య కరమైన ఆహార నియమాలు పాటించాలి. అధిక బరువు తగ్గించుకోవాలి. డాక్టర్ పర్యవేక్షణ లేకుండా ఇష్టం వచ్చినరీతిలో మందులు వాడకూడదు. పొగతాగటం, మద్యం తాగడం లాంటి దురాలవాట్లుకు దూరంగా ఉండాలి. పరిమితమైన ఆహారం, ఆహారంలో ఉప్పుతగ్గించి వాడటం, ఎక్కువగా నీటిని తాగటం చేయాలి.

–డాక్టర్ మారెడ్డి శ్రీనివాసరెడ్డి, నెఫ్రాలజిస్ట్, గుంటూరు

బ్లడ్ గ్రూప్ మ్యాచ్ అవ్వకపోయినా ఆపరేషన్...



బ్లడ్‌గ్రూప్ మ్యాచ్‌కాకపోయినా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేసే ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. బ్లడ్ గ్రూప్ మ్యాచ్ అవ్వని వారిలో ప్లాస్మా ఫెరోసిస్ ద్వారా ఆపరేషన్‌కు ముందుగానే రక్తంలోని యాంటీ బాడీస్‌ను తీసిచేసి సర్జరీ చేస్తున్నాం. డయాలసిస్ చేయించుకునేవారికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేస్తే ఎంతో ఉపయోగంగా ఉండి జీవితకాలం 20 ఏళ్ల వరకు పొడిగించవచ్చు.

–డాక్టర్ చింతారామకృష్ణ, సీనియర్ నెఫ్రాలజిస్ట్, గుంటూరు

జీజీహెచ్‌లో సేవలు



జీజీహెచ్‌లో ప్రతిరోజూ కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతూ చికిత్స కోసం వచ్చేవారి సంఖ్య 60 నుండి 70 వరకు ఉంటుంది. వీరే కాకుండా ప్రతిరోజూ 50 మందికి పైగా రోగులు డయాలసిస్ చేయించుకుంటున్నారు. హెచ్ఐవీ, హెచ్‌సీఈ లాంటి ఇన్‌ఫెక్షన్లు, పాజిటివ్ కేసులకు కూడా జీజీహెచ్‌లో ఉచితంగా డయాలసిస్ చేస్తున్నారు. ఆస్పత్రిలో 24 గంటలూ డయాలసిస్ వైద్యసేవలు కొనసాగుతున్నాయి. జీజీహెచ్‌లో 24 మందికి ఉచితంగా కిడ్ని మార్పిడి ఆపరేషన్లు చేశాం.

–డాక్టర్ గొంది శివరామకృష్ణ, నెఫ్రాలజి అసోసియేట్ ప్రొఫెసర్, జీజీహెచ్

స్కానింగ్‌తో గర్భస్థ శిశువు లోపాలు గుర్తించవచ్చు

గైనకాలజిస్టుల సంఘం నేతలు వెల్లడి

గుంటూరు మెడికల్: అల్ట్రాసౌండ్ స్కానింగ్ ద్వారా గర్భంలో ఉన్న శిశువుకు లోపాలు ఉంటే ముందస్తుగానే గుర్తించి నివారించే ప్రయత్నం చేయవచ్చని డాక్టర్ శ్వేత అన్నారు. గైనకాలజిస్టుల సంఘం ఆధ్వర్యంలో గుంటూరులోని శ్వేత ఫీటల్ మెడిసిన్ సెంటర్‌లో అల్ట్రా సౌండ్ ఏ విధంగా చేయాలనే విషయాలపై నిరంతర వైద్య విద్య(సీఎంఈ) కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గర్భిణులకు ఏ విధంగా స్కానింగ్ పరీక్షలు చేయాలి, పిండంలోని లోపాలను ఏ విధంగా గుర్తించాలి అనే విషయాలను డాక్టర్ శ్వేత వివరించారు. గైనకాలజీ వైద్యుల సంఘం సెక్రటరీ, సీనియర్ ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ మాట్లాడుతూ గర్భిణులకు అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయటం వల్ల అనేక లాభాలు ఉంటాయన్నారు. ముఖ్యంగా గర్భంలో ఉండే శిశువు ఆరోగ్య పరిస్థితి గురించి గైనకాలజిస్టులు, శిశువుల తల్లులు స్కానింగ్ ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని వివరించారు. క్రమం తప్పకుండా గర్భం దాల్చిన నాటి నుంచి నెలా నెలా స్కానింగ్ చేయించటం ద్వారా బిడ్డ ఆరోగ్యంపై పూర్తి అవగాహన ఉంటుందని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్కానింగ్ చేసేవారు కాని, చేయించుకునేవారు గాని కడుపులో ఉండే శిశువు ఆడ లేక మగ అనే విషయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పకూడదన్నారు. పీసీపీఎన్‌డీటీ చట్ట ప్రకారం లింగ నిర్ధారణ నేరమని, దీనికి తీవ్రమైన శిక్షలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రూన్సీ వాణి, డాక్టర్ శనక్కాయల రాజకుమారి, డాక్టర్ ఇందిరా, డాక్టర్ షమా సుల్తానా, గుంటూరు మెడికల్ కాలేజ్, కాటూరి మెడికల్ కాలేజ్ పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన గైనకాలజిస్టుల సంఘం నేతలు, గైనకాలజిస్టులు

ముగ్గురిపై కేసు నమోదు

లక్ష్మీపురం: బహిరంగ మద్యం తాగి దారి మార్గంలో వాహనదారులకు, స్థానికులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ముగ్గురిపై పట్టాభిపురం పోలీసులు ఆదివారం సాయంత్రం కేసు నమోదు చేసిన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించే ఏఎస్ఐ సాంబశివరావు, కానిస్టేబుల్ గోపి ఆదివారం సాయంత్రం సమయంలో హనుమయ్య కాలనీ వాటర్ ట్యాంక్‌ల వద్ద విజిబుల్ పోలీసింగ్ చేస్తున్నారు. అదే ప్రదేశంలో బత్తుల రాజు, పొట్టుపల్లి త్రినాథ్‌కుమార్, తెలగతోటి దేవరాజు అనే ముగ్గురు బహిరంగ ప్రదేశంలో మద్యం తాగి స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. దీంతో ముగ్గురిని అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

రిజిస్ట్రేషన్ చార్జీలు పెంపుదల అన్యాయం

లక్ష్మీపురం: రాష్ట్రంలో ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలను దాదాపు 20 శాతం నుంచి 40 శాతం పెంపుదల అన్యాయమని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేట అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్ విలువలను రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు అడ్డగోలుగా సవరించారని, భారమంతా ప్రజలపై మోపి వారికి ఊపిరాడకుండా చేయనున్నారన్నారు. తక్షణమే తగ్గించాలని కోరారు.

సాయిరాగ సంగీత కళాశాల నాలుగో వార్షికోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై ఆదివారం శ్రీ సాయి రాగ సంగీత కళాశాల 4వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల విద్యాశాఖ ఉప కార్యదర్శి రావినూతల వెంకటేశ్వర్లు, అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ కందిమళ్ల శ్రీనివాసరావు, దేవస్థాన పాలక మండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ మునిపల్లె రమణి తన శిష్యులతో అన్నమయ్య కీర్తనలు ఆలపించి ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఈసందర్భంగా అతిథులు పిల్లలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు సమర్పించారు. ప్రముఖ రంగస్థల నటుడు, నంది అవార్డు గ్రహీత బసవరాజు జయ శంకర్‌ను సన్మానించారు. అనంతరం కళాశాలలో సంగీతం నేర్చుకునే పిల్లలు తమ గురువును ఘనంగా సన్మానించారు.



చిన్నారులతో రావినూతల వెంకటేశ్వర్లు, జాస్తి వీరాంజనేయులు, శ్రీనివాసరావు

వైభవంగా వసంత పంచమి



గుంటూరు రూరల్: మండలంలోని అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజీ ఆవరణలో ఆదివారం వసంత పంచమి సందర్భంగా సరస్వతీదేవి అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు చావలి సరోజిని విద్యార్థులను ఆశ్వీరదీస్తూ సరస్వతీదేవి అనుగ్రహంతో పాటు మీరు కూడా నిరంతరం శ్రమించినపుడే మంచి ఫలితాలు సాధ్యమని తెలిపారు. జూనియర్ కాలేజీ ఇన్‌చార్జి రామచంద్ర రావు మాట్లాడుతూ జూనియర్ కాలేజీ విద్యార్థులు గతఏడాదికన్నా మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. వేదపండితులు కష్ణమాచార్యులు విద్యార్థులతో పూజలు చేయించి మంచి ఫలితాలు సాధించాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో విగ్రహ దాత ఈదా వెంకటేశ్వరరెడ్డి, విశ్రాంత అధ్యాపకులు మున్నంగి సంజీవరెడ్డి, దేవగిరి వీర గంగాధరరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను తల్లిదండ్రులు గుర్తించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: పిల్లలకు ఏ రంగంలో ఆసక్తి ఉందో గుర్తించి, వారికి ఇష్టమైన రంగంలో ప్రోత్సహించడం ద్వారా జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకుంటారని టీజేపీఎస్ కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం పేర్కొన్నారు. సాహితీ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గతనెల 28, 29వ తేదీల్లో నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఆదివారం టీజేపీఎస్ కళాశాలలో బహుమతి ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సాహితీ అకాడమీ కార్యదర్శి ఆర్.శివాజీ మాట్లాడుతూ గత 20 ఏళ్ల నుంచి జిల్లా స్థాయిలో పాఠశాలల విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహిస్తున్నామని, విద్యార్థుల్లో దాగిన క్రీడా నైపుణ్యాలను గుర్తించి వారికి ఉచితంగా క్రీడా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా వడ్లమూడిలోని చాణక్య హైస్కూల్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌గా కై వసం చేసుకోగా, ఇతర అంశాల్లో నరసరావుపేటలోని సింధు హైస్కూల్, వినుకొండలోని గుడ్ షఫర్డ్ స్కూల్, చాణక్య హైస్కూల్, డాక్టర్ ఏఎల్‌పీ పబ్లిక్ స్కూల్ సింధు హైస్కూల్ విద్యార్థులు రన్నర్లుగా నిలిచారు. కార్యక్రమంలో స్నాప్ జిమ్ డైరెక్టర్ గోపాల్ కృష్ణారెడ్డి, మున్నంగి పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీనారాయణరెడ్డి, చాణక్య విద్యాసంస్థ డైరెక్టర్ డి.కిషోర్, సాహితీ అకాడమీ అధ్యక్షులు ఈదర శివ నాగమణి, టోర్నమెంట్ నిర్వాహకులు సైదయ్య పాల్గొన్నారు.



ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

యాదవ హైస్కూల్లో పూర్వ విద్యార్థుల సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: పాత గుంటూరులోని యాదవ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1968–69 ఎస్ఎస్ఎల్సీ చివరి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సమావేశానికి హాజరైన పూర్వ విద్యార్థులు పాఠశాలలో చదివిన రోజులను గుర్తు చేసుకున్నారు. పాఠశాల కార్యదర్శి మైలా అంజయ్య, ప్రధానోపాధ్యాయురాలు కె.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పూర్వ విద్యార్థులు ఇందిర, డాక్టర్ ఆలా సాంబశివరావు, తమ్మిశెట్టి వెంకటరావు, పాండురంగారావు, సీహెచ్ బ్రహ్మయ్య, శేషుకుమారి, ఉమాదేవి పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పూర్వ విద్యార్థులు

క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య అవసరం



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల సమగ్రాభివృద్ధికి క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య ఎంతో అవసరమని ప్రాంతీయ అగ్నిమాపక శాఖాధికారి ఎంఏక్యూ జిలానీ పేర్కొన్నారు. శ్యామలానగర్‌లోని శ్రీవేంకటేశ్వర బాలకుటీర్ 50వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిలానీ మాట్లాడుతూ విద్యార్థి సమగ్ర వికాసానికి అందరూ తోడ్పడాలని, సంస్కృతి, సంప్రదాయాలతో కూడిన విద్యను అందించడం ద్వారా బాలలు భావిభారత పౌరులుగా ఎదుగుతారని ఆకాంక్షించారు. ఏఎన్‌యూ ఇంటర్నేషనల్ స్టూడెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ పద్మావతి మాట్లాడారు. ఈసందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో ఏఎన్‌యూ విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు, బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎస్.మంగాదేవి, సీఏవో దుర్గా రఘురాం, జయశ్రీ, ప్రిన్సిపాల్ సుధామాధవి పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నిక పకడ్బందీగా నిర్వహించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూ నగర్: నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు సోమవారం పకడ్బందీగా నిర్వహించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. ఉదయం కమిషనర్, ఎన్నికల అధికారి, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఇతర అధికారులతో కలసి ఆదివారం ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించారు. తొలుత ఎన్నికల నిర్వహణకు సంబంధించి సూచిక బోర్డులు, పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కంపార్ట్ మెంట్, బ్యాలెట్ బాక్స్, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సామగ్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్టాండింగ్ కమిటీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. పోలింగ్ ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యి మధ్యాహ్నం 3 గంటలకు ముగుస్తుందని వివరించారు. ఓటు వేయుటకు వచ్చే కార్పొరేటర్లుకు మాత్రమే కార్యాలయంలోకి అనుమతి ఉంటుందని, లోపలకు వచ్చు సమయంలో నగర పాలక సంస్థ జారీ చేసిన ఐడెంటి కార్డులు విధిగా కలిగి ఉండాలని, ఫోన్లు, ఎలక్ట్రానిక్ సంబంధిత వస్తువులు, ఏ ఇతర సామగ్రిని పోలింగ్ కేంద్రంలోకి అనుమతించబడదన్నారు. కార్పొరేటర్ల ఇతర వస్తువులు భద్రపరచుకునేందుకు నగర పాలక సంస్థ పార్కింగ్ ప్రాంతంలో పౌరసేవా కేంద్రం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్లోక్ రూమ్‌లో భద్రపరచుకోవాలని సూచించారు. పోలింగ్ సందర్భంగా నగర పాలక సంస్థ కార్యాలయంలోకి ఇతర వాహనాలు పార్కింగ్ నిషేధించడమైనదని వెల్లడించారు. ఓటింగ్ కోసం కార్యాలయానికి వచ్చే కార్పొరేటర్ల వాహనాలను గాంధి పార్క్ పార్కింగ్‌లో పార్కింగ్‌కు అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఓటు వేసేందుకు వచ్చే కార్పొరేటర్లు నగర పాలక సంస్థ ప్రధాన ద్వారం నుంచి ప్రవేశించి పోలీస్ తనిఖీ అనంతరం పోలింగ్ కేంద్రంలో వారి ఓటు వినియోగించుకొని, నగర పాలక సంస్థ పార్కింగ్ ద్వారం నుంచి బయటకు వెళ్ళేలా ఏర్పాట్లు చేశామన్నారు. నగర పాలక సంస్థ ఉద్యోగులు విధిగా నగర పాలక సంస్థ గుర్తింపు కార్డుతో, వారికి కేటాయించిన విభాగాల్లోనే విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు సిబ్బంది ఉదయం 8 గంటలకల్లా గుర్తింపు కార్డుతో విధులకు హాజరుకావాలని, ఎన్నికల అధికారి తప్ప ఇతర ఎన్నికల సిబ్బంది ఫోన్లను పోలింగ్ కేంద్రంలోకి అనుమతించబడదన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మూడంచెల భద్రతతో పోలీస్ బందో బస్తు ఏర్పాటు చేశామని వివరించారు. కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారి, డెప్యూటీ కమిషనర్ 1 డి.శ్రీనివాసరావు, కౌన్సిల్ సెక్రటరీ పి.శ్రీనివాసరావు, ఓటర్ల గుర్తింపు అధికారి, నగర పాలక సంస్థ మేనేజర్ షేక్ బాలాజీ బాషా, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పద్మనాభరావు, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్

అనధికార మాంసం విక్రయాలు జరిపితే చర్యలు

నెహ్రూ నగర్: గుంటూరు నగరంలోని రోడ్లపై నాటు కోళ్లు, చేపలు అనధికార విక్రయాలపై ప్రజారోగ్యం దృష్ట్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఎంహెచ్ఓ రవి బాబు పేర్కొన్నారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ ప్రజారోగ్య అధికారులు ఆదివారం బృందాలుగా ఏర్పడి నగరంలో తనిఖీలు నిర్వహించారు. మిర్చియార్డు, ఆర్టీఓ ఆఫీసు, గుజ్జనగుండ్ల, అమరావతి రోడ్డు, పట్టాభిపురం ప్రాంతాలలో రోడ్లపై అనధికారికంగా చేపలు, నాటుకోళ్ళు, మేకలను వధించి విక్రయిస్తున్న వారిని గుర్తించి వారి పై దాడులు నిర్వహించి వాటిని తొలగించి, అపరాధ రుసుం క్రింద 12,500 రూపాయలు వసూలు చేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ నగర పరిధిలో ఎక్కడైనా అనధికారికంగా నాటు కోళ్లు, చేపలు, మాంసం విక్రయాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వెటర్నరి డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్ఎస్ ఆనందకుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్లు సి.హెచ్ శ్రీనివాస్, నాగేశ్వర రావు, రాము, దాస్ పాల్గొన్నారు.



నాటు కోళ్లు విక్రయించే వారి వివరాలు తెలుసుకుంటున్న ప్రజారోగ్య సిబ్బంది

బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ 5న నిరసన కార్యక్రమాలు

రైతు సంఘం జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్ పిలుపు

లక్ష్మీపురం: కేంద్ర బడ్జెట్ వ్యవసాయరంగాన్ని కాపాడే విధంగా లేదని, కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చే విధంగా ఉందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ తెలిపారు. స్థానిక రైతు సంఘ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని కాపాడాలని కోరుతూ ఈనెల 5వ తేదీన దేశవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో బడ్జెట్ ప్రతులను దహనం చేయాలని ఆల్ ఇండియా కిసాన్ సభ పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమాన్ని రైతులు విజయవంతం చేయాలని కోరారు. మద్దతు ధర గ్యారెంటీ చట్టంపై ఎటువంటి హామీ ఇవ్వకపోవడం రైతులను మోసగించడమేనని అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నామమాత్రపు కేటాయింపుల వల్ల ప్రయోజనం లేదన్నారు. వ్యవసాయ రంగానికి కేవలం లక్ష 71 వేల కోట్లు మాత్రమే కేటాయింపులు చేయడం వల్ల వ్యవసాయ రంగానికి పెద్దగా మేలు జరగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్ లో 10 శాతం నిధులు వ్యవసాయ రంగానికి కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్ కుమార్

వైజ్ఞానిక ప్రదర్శనలతో విజ్ఞానం

గుంటూరు ఎడ్యుకేషన్: దేశంలో 60 శాతానికి పైగా ఉన్న విద్యార్థులు, యువతరం అగ్ర భారత నిర్మాణంలో కీలకంగా ఉన్నారని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. పాతగుంటూరులోని కన్నా హైస్కూల్లో రెండు రోజులపాటు నిర్వహించిన ఆల్‌రౌండ్ ఎగ్జిబిషన్–2025 ఆదివారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ భావిశాస్త్రవేత్తలుగా రాణించేందుకు పాఠశాల స్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని అన్నారు. విద్యారంగంలో దశాబ్దాల అనుభవం ఉన్న కన్నా మాస్టారు వెనుకబడ్డ ప్రాంతమైన పాత గుంటూరులో నాణ్యమైన విద్యా బోధన ద్వారా విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ప్రత్యేక అతిథులుగా పాల్గొన్న పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ పి.పార్వతి, ఇగ్నో డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రసాద్ బాబు, కన్నా విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ కన్నా మాస్టారు మాట్లాడారు. రెండు రోజుల వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా 600 పైగా నమూనాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను 20వేల మందికి పైగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు సందర్శించారని వివరించారు. కార్యక్రమంలో ప్రధాన సలహాదారు వి.రాజేశ్వరి దేవి, అకడమిక్ డైరెక్టర్ కె.శ్రీదేవి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రత్న కుమారి పాల్గొన్నారు.



సంప్రదాయ వస్త్రధారణలో ఉన్న విద్యార్థులతో పార్వతి, ప్రసాద్‌బాబు, కన్నా మాస్టారు

ఏఐపీఎల్‌సీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

గుంటూరు ఎడ్యుకేషన్: ఆల్ ఇండియా పీపుల్స్ లిటరరీ ఆర్ట్ అండ్ కల్చరల్ ఫోరం (ఏఐపీఎల్‌సీఎఫ్) అధ్యక్షునిగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన గౌతమ్ ముఖర్జీ ఎన్నికయ్యారు. గుంటూరులోని రెవెన్యూ కళ్యాణ మండపంలో మూడురోజుల పాటు నిర్వహించిన అఖిల భారత ప్రజా సాహిత్య, సాంస్కృతిక సభలు ముగిసిన సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా సంఘ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి రవిబాబు, ఉపాధ్యక్షునిగా దివికుమార్(ఏపీ), కోశాధికారిగా రమణ ప్రసాద్ (తెలంగాణ), సభ్యులుగా భట్టు లక్ష్మీనారాయణ, భూపాల్ (తెలంగాణ), సియాశరణ్ శర్మ, సుజయ్ రాయ్, ప్రజాపతి (జార్ఖండ్), బసుదేవ్ దాస్, భవానీ, అజ్మల్ అన్సారి (బిహార్), షిండే (మహారాష్ట్ర), సుగధన్ పాల్ (కేరళ) అరుణ (ఏపీ) ఎన్నికయ్యారు.